


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 4.04.2026 | సంపుటి: 3 | సంచిక: 63 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 4.04.2026 | VOLUME : 3 | ISSUE : 63 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




రైతు భరోసా జమకు

## రంగం సిద్ధం

- పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం
- నిధులు సమకూర్చాలని సీఎం రేవంత్ ఆదేశం

2

# తెలంగాణ డీఎన్‌ఏలోనే టెక్స్‌టైల్

మా విజన్‌లో భాగస్వాములు కండి

ఎటెక్స్‌కాన్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 3:

నిజాం కాలంలో ప్రపంచం నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు.. టెక్స్‌టైల్ మనకు పరిశ్రమ మాత్రమే కాదు.. జీవనాధారం అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ డీఎన్‌ఏలోనే టెక్స్‌టైల్ ఉందని చెప్పడానికి గర్విస్తున్నానన్నారు. హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్-2026 (ఎటెక్స్‌కాన్)లో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు

మిగతా 2వ పేజీలో..



భారత నౌకాదళానికి

## మరో బలం

- అత్యాధునిక యుద్ధనౌక ఐఎన్ఎస్ తారాగిరి జలప్రవేశం..
- విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్
- స్టెల్త్ సాంకేతికతతో నూతన ఫ్రిగేట్
- బ్రహ్మోస్, బరాక్,-8 క్షిపణులతో సన్నద్ధం

4




## ఆ పార్టీలకు కాలం చెల్లింది

- బీజేపీలో రాముడి రాజకీయం
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వంద సీట్లు సాధిస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్

మంచిర్యాల, ఏప్రిల్ 3:

రాష్ట్ర రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా

మిగతా 3వ పేజీలో..

## న్యూ స్వదేశీ విజన్‌కు శ్రీకారం

గ్లోబల్ సప్లై చైన్‌లో నేతన్న యజమానిగా ఎదగాలి

ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

2

## గ్రూప్1పై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- 'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ప్రజాతంత్ర, ఏప్రిల్ 3:

తెలంగాణ గ్రూప్1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం

మిగతా 2వ పేజీలో..



మరో మూడు

## రోజులు పార్లమెంట్

- 16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం
- మహిళా రిజర్వేషన్, ఎస్‌సిఆర్‌ఎం సవరణ బిల్లులపై చర్చ

4

## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం
- మహబూబ్‌నగర్‌లో దొడ్డి కొమురయ్యకు హరీష్‌రావు నివాళి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 3:

బీసీలకు, కుర్వ, గొల్ల, కురుమలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో కొము రయ్య విగ్రహానికి మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు

మిగతా 2వ పేజీలో..




దొడ్డి కొమురయ్యకు

## కేసీఆర్ నివాళి

2

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

2

## యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

- ఎప్‌స్టీన్ వ్యవహారంలో సరిగా వ్యవహరించలేదన్న ఆరోపణ

4



## వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలు..

- డిజిటల్ దిశగా తెలంగాణ అడుగు

3

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం

తెలంగాణలో పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు

పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో మంత్రులు భట్టి, పొన్నం




2



ఫీజుల నియంత్రణ

## చట్టం చేయాలి

- ఆనాడు మాట్లాడిన రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు
- టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు




3

భవన నిర్మాణానికి

## ముందస్తు పరీక్ష తప్పనిసరి

- ఈ పరీక్షలు లేకపోతే భవనాలు కూలిపోతాయి
- జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ ప్రాముఖ్యతను మరచిపోకూడదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



3

## కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే వ్యతిరేకత

రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు

మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

3



## కార్బైడ్ మామిడి పండ్లను గుర్తించండి

- పోలీస్ కమిషనర్ సజ్జనార్

3

## గ్రామ సభలు విజయవంతం

- మంత్రి సీతక్క హర్షం

హైదరాబాద్, ప్రజాతంత్ర, ఏప్రిల్ 3:

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతంగా పూర్తి కావడం పట్ల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజా పాలనను బలోపేతం చేసే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో సహకరించారని ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల్లో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సమస్యలు, పారిశుధ్యం, మౌలిక వసతులపై విస్తృతంగా చర్చలు జరగడం

మిగతా 2వ పేజీలో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹62

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ బీసీలకు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని రూ. 7 కోట్లు మాత్రమే నిధులు ఖర్చు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. శాసన సభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసినట్టు వెల్లడించారు. యాదవులకు గొర్లు ఇస్తామని, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని చెప్పారు.దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను కోరితే వెంటనే అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ పచ్చబడాలని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు హరీష్ రావు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. గతంలో 14 రోజులకు ఒకసారి నీళ్లు రాగా బీఆర్ఎస్ హయాంలో ప్రతి రోజు నీళ్లు ఇచ్చామని వివరించారు. రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేమని, సాగు నీరు అందించేందుకు పూర్తి ప్రయత్నాలు చేసామని తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని వెల్లడించారు. రాజకీయంగా బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ లు ఇస్తామని మోసం చేశారని తెలిపారు .విద్య, ఉద్యోగాల్లో కూడా రిసర్వేషన్ ఇవ్వడం లేదని ఆరోపించారు.



# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

నారాయణపేట, ఏప్రిల్ 3:

గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బడ్జెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని హరీశ్‌రావు అన్నారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు. లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనవడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా అని ప్రశ్నించారు. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళలో పల్లకీ మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణ మాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలని సవాల్ చేశారు. నేను కొడంగల్ వచ్చినా గ్రామ సభల్లో నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతలని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్ 3లో కొంత పని మిగిలి ఉంది. ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయట్లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని హరీశ్‌రావు అన్నారు.

# దొడ్డి కొమురయ్యకు కేసీఆర్ నివాళి

హైదరాబాద్, ప్రజాతంత్ర, ఏప్రిల్ 3:

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళులర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య అమరత్వం నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్లపాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు. తమ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజకీయ హక్కుల కోసం తెలంగాణ సబ్బండ కులాల పోరాటాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగ పరమైన హక్కులను అందించగలిగిన నాడే దొడ్డి కొమరయ్య వంటి ఎందరో తెలంగాణ అమరులు, త్యాగధనులకు నిజమైన ఘన నివాళి అర్పించినట్లవుతుందని స్పష్టం చేశారు.

# గ్రామ సభలు విజయవంతం

మొదటిపేజీ తరువాయి

శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వ్యక్తపరచారని, అధికారులు వాటిని శ్రద్ధగా స్వీకరించడం ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యదేవరాజన్, అన్ని స్థాయిలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి ప్రజాపాలనా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గ్రామ కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించడం ద్వారా అభివృద్ధి పరిపూర్ణమవుతుందని పేర్కొన్నారు. ఇకపై గ్రామ సభల్లో వచ్చిన సూచనలు, సమస్యలను ప్రాధాన్యతతో ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. గ్రామ స్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు.

**ప్రణతీపుకాన్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి : అసోంలో మంత్రి సీతక్క ప్రచారం**

అసోం రాష్ట్రంలోని దిబ్రూగర్ జిల్లా నహర్కటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని కాంగ్రెస్ అభ్యర్థి ప్రణతీ ఫుకాన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నహర్కటియా ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో ప్రజలకు సేవలందించిన అనుభవం ఉన్న నాయకురాలు ప్రణతీ ఫుకాన్‌ను గెలిపిస్తే నియోజకవర్గానికి మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని, స్థానిక యువత, మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# న్యూ స్వదేశీ విజన్‌కు శ్రీకారం

- గ్లోబల్ సప్లై చైన్‌లో నేతన్న యజమానిగా ఎదగాలి
- ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 3:

గతాన్ని విస్మరించొద్దు. భవిష్యత్తుకు ఇంజిన్‌లా మార్చుకున్నప్పుడే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి.. ఆ దిశగానే తెలంగాణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఈ ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హెచ్ఐసీసీ నోవాటెల్‌లో శుక్రవారం నిర్వహించిన 13వ ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. తమ దృష్టిలో టెక్స్‌టైల్ అంటే వ్యాపారం మాత్రమే కాదు.. అది అట్టడుగున ఉన్న నేతన్నకు అందించే సామాజిక న్యాయం అని చెప్పారు. గ్లోబల్ సప్లై చైన్‌లో నేతన్న కేవలం కూలీగానే మిగిలిపోకుండా యజమానిగా ఎదగాలన్నదే వతమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆ దిశగా నేతన్నలను ప్రోత్సహిస్తున్నామని, అన్ని రకాలుగా అండగా ఉంటున్నామని చెప్పారు. చరఖాకు టెక్నాలజీని అనుసధానించి 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో 'న్యూ స్వదేశీ' విజన్‌కు ఈ వేదికపై నుంచే శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. దేశం లేదా పరిశ్రమ ఒంటరిగా ఎదగలేదు. ఇది ఎవరూ కాదనలేని అక్షర సత్యం. అందుకే గ్లోబల్ ఫ్యాషన్ కారిడార్లు, సర్క్యులర్ హబ్స్‌తో తెలంగాణను ప్రపంచానికి కనెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. డిజిటల్ డిజైన్, గ్లోబల్ కనెక్టివిటీ ద్వారా మన నేతన్నల నైపుణ్యాన్ని మిలాన్, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికలపైకి చేర్చాలని లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తున్నామని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణను కేవలం ఒక 'ఫ్యాక్టరీ'లా మాత్రమే కాకుండా, కొత్త ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే 'మేధో కేంద్రం'గా తీర్చిదిద్దేలా చిత్త శుద్ధితో కృషి చేస్తున్నాం. లిఅందుకోసం... తక్కువ ధర కంటే, అత్యున్నత నాణ్యతకే ప్రాధాన్యత ఇస్తున్నాం. బ్లాక్‌చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఏఐ లాంటి అత్యాధునిక టెక్నాలజీస్ సాయంతో సప్లై చైన్‌లో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్నాం.. కేవలం ఉత్పత్తిపైనే కాక ఆవిష్కరణలను ప్రోత్సహించే ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నాం.. అదే మా 'విజన్ 2047'.. మాటల్లో కాదు.. చేతల్లోనూ చేసి చూపిస్తున్నాం అని వివరించారు. రైతు, నేతన్న, కార్మికుడు, పెట్టుబడిదారుడు.. ఇలా అందరూ కలిసి లాభాలను పంచుకునే కొత్త పారిశ్రామిక వ్యవస్థకు శ్రీకారం చుట్టేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. వాస్తవానికి ఈ లక్ష్యం పెద్దదే కానీ తెలంగాణ భవిష్యత్తు కోసం ఎదురు చూడటం లేదు. దాన్ని నిర్మించే పనిలో నిమగ్నమై ఉందని మరువొద్దు. భవిష్యత్తును నిర్మించేందుకు 'తెలంగాణ'తో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇక్కడికి విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, నిపుణులను సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యసాధనలో కీలక భాగస్వాములుగా గౌరవిస్తాం. అన్ని రకాలుగా అండగా ఉంటాం అని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు.

## రైతు భరోసా జమకు రంగం సిద్ధం

హైదరాబాద్, ఏప్రిల్ 3:

రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ.2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరంలోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

## గ్రూప్1పై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాను.. ఇది ఉద్యోగ నియామకాల పట్ల మా ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నాను అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. కొలువుల కోసం ఏళ్లకు ఏళ్లు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు వెళ్లదీసిన గ్రూప్ 1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట. ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసి ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో తొలి గ్రూప్ 1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశాం. వారికి మరోసారి నా అభినందనలు. ప్రభుత్వ ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ చైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- తెలంగాణలో పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు
- పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో మంత్రులు భట్టి, పొన్నం



పుదుచ్చేరి, ఏప్రిల్ 3:

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణకు, రాజ్యాంగం మనకు కల్పించిన గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాలంటే కాంగ్రెస్, డీఎంకే కూటమి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు విద్యలింగంతో కలిసి పుదుచ్చేరిలోని మనవేలి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనంతరామన్‌కు, ఎంబాలం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతన్‌కు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురండి... పుదుచ్చేరిని రక్షించండి అని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, డీఎంకేలతో కూడిన sజూa కూటమి ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. తమ కూటమి హామీల అమలుపై ఎన్డీయే కూటమి చేస్తున్న అసత్యాలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దన్నారు. పుదుచ్చేరి బంగారు భవిష్యత్తుకు ఎస్పీఏ కూటమిని గెలిపించడం ఒక్కటే పరిష్కారమార్గం అన్నారు. గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని, దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మొదటి కేబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధి రేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని చెప్పారు.

# తెలంగాణ డీఎన్ఏలోనే టెక్స్‌టైల్

మొదటిపేజీ తరువాయి



విచ్చేసిన మీరు అతిథులు మాత్రమే కాదు.. మా అభివృద్ధిలో, మా విజన్‌లో భాగస్వాములు అని చెప్పారు. భారత దేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది.. శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్ రంగానికి మరింత పరిపూర్ణతనిచ్చాయని తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పవిత్ర వస్త్రాలను సమర్పించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ పోచంపల్లి ఇక్కత్ నుంచి గద్వాల్ చీరల వరకు, వరంగల్ దర్రీస్ నుంచి నారాయణపేట చేనేత వరకు ఎన్నో ఉన్నాయని చెప్పారు. టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలు ఉన్నాయి.. దేశంలో పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా ఉంది. మన పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరు ఉంది.. టెక్స్‌టైల్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశామని వివరించారు. ఇందులో అనేక అపరెల్ పార్కులు ఉన్నాయి.. తెలంగాణలో నైపుణ్యంతోపాటు సంకల్పం కూడా ఉంది.. డీప్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ ఇలా అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉంది అని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం తమ విజన్ అని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటుంది. టెక్స్‌టైల్ రంగంలో తమకు ఒక విజన్ ఉంది.. 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియా టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రభుత్వం మీకు మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలతోపాటు వేగంగా అనుమతులు మంజూరు చేస్తుంది.. అత్యుత్తమ మానవ వనరులు మా బలం.. మీకు విజన్ ఉంటే మీ పెట్టుబడులకు తెలంగాణ సరైన వేదిక. మాతో కలిసి రండి.. అని పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని మార్చగల పూర్తి టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దాం.. పత్తి ఉత్పత్తిలోనే కాదు.. లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో తెలంగాణ కలిసి పనిచేస్తోంది అని వెల్లడించారు. దేశానికి మాత్రమే కాదు.. ప్రపంచానికి కూడా సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోంది. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ ఇక్కడ స్టూడియోలను ప్రారంభించింది. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ కేంద్రంగా మార్చుకున్నాయి.. ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరింది. సినిమా రంగం తమ ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ నుంచే పొందేలా ప్రోత్సహిస్తాము. పర్యావరణ పరిరక్షణ మా అత్యున్నత ప్రాధాన్యం.. అని చెప్పారు. గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తాం.. యువతకు, ముఖ్యంగా మహిళలకు శిక్షణ అందిస్తాం.. సంప్రదాయ ఆలోచనలను ఆధునిక టూల్స్‌తో కలిపి డిజైన్, కటింగ్, స్టిచింగ్‌లో ఉపయోగించేలా చేస్తాం.. ప్రపంచానికి వ్యాక్సిన్లు, ఔషధాలు అందించిన రాష్ట్రం మనది.. ఆపిల్ ఇయర్‌పాడ్స్ కూడా ఇక్కడే తయారవుతున్నాయి. ఇప్పుడు ప్రపంచంలోని ప్రతి దేశంలో తెలంగాణలో తయారైన దుస్తులు ధరించేలా లక్ష్యంగా పెట్టుకున్నాం అని సీఎం రేవంత్ వివరించారు.

# ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- **ఆనాడు మాట్లాడిన రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు**
- **టిఆర్ ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**




**హైదరాబాద్, ఏప్రిల్ 3:**
రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 39,640 పాఠశాలలు ఉండగా వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదేపదే మాట్లాడారని గుర్తు చేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచవని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, హాస్పిటల్స్‌ను సీఎం ప్రారంభిస్తున్నారంటూ వాళ్ళ దోపిడీని ప్రోత్సహిస్తున్నారా అని నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ అంటూ వ్యాఖ్యానించారు. ఆంధ్రా, ఉత్తర భారతం వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. కాగా, పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తన పార్టీ గురించి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని, ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చని అన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

# వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలు..

- **డిజిటల్ దిశగా తెలంగాణ అడుగు**

**హైదరాబాద్**





తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల విస్తరణకు వేగం పెంచింది. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందించేందుకు కొత్త విధానాలను అమలు చేస్తోంది. సెల్‌ఫోన్ ద్వారానే అన్ని సేవలు అందేలా చర్యలు చేపడుతోంది. ప్రభుత్వం పాలనను ప్రజల చేతిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మీసేవ సేవలు, ఇంటర్, పదో తరగతి పరీక్షల హాల్ టికెట్లు వాట్సాప్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది.
ఇప్పుడు వివిధ శాఖల సేవలను కూడా దశలవారీగా వాట్సాప్‌కు అనుసంధానం చేస్తోంది. దీంతో ప్రభుత్వానికి సంబంధించిన సేవల లింకులు ఒక్క మెసేజ్‌తోనే అందుబాటులోకి రానున్నాయి. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి ఉద్యోగ నియామక పరీక్షల సేవలను కూడా వాట్సాప్ ద్వారానే అందించే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.
ఈ సేవల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 80969 58096 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేర్వేరు శాఖలకు వేర్వేరు పోర్టల్‌లు ఉండటంతో ఏర్పడిన గందరగోళానికి పరిష్కారంగా ఒకే వాట్సాప్ నంబర్ ద్వారా అన్ని సేవలను అందించే విధానం అమలు చేస్తున్నారు. ఫిర్యాదులు నమోదు చేయడం నుంచి సర్టిఫికెట్లు పొందడం వరకు సేవలను ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. ఇటీవల పలు ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లు కూడా వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పేరు నమోదు చేస్తే హాల్ టికెట్ పొందే అవకాశం కల్పించారు. రానున్న రోజుల్లో రిజల్ట్స్ కూడా ఇదే వేదికపై తెలుసుకునే విధంగా చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ సమాచార సందేశాలు, అలర్టులు కూడా ఇదే నంబర్ ద్వారా పంపనున్నారు.
ప్రస్తుతం మీసేవలో లభించే ఎక్కువ సేవలు వాట్సాప్‌లో అందుతున్నాయి. కులం, ఆదాయం సర్టిఫికెట్లు, వాటి స్థితి తెలుసుకోవడం నుంచి మున్సిపల్ పన్నుల చెల్లింపు వరకు సేవలు అందుబాటులో ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, పౌర సరఫరాల వంటి కీలక శాఖల సమాచారం కూడా అందిస్తున్నారు. "హాయ్" అని మెసేజ్ పంపితే సేవల జాబితా ప్రత్యక్షమవుతుంది.
రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలను కూడా ఈ చాట్‌బాట్‌కు అనుసంధానం చేయనున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి వంటి పథకాలకు దరఖాస్తు, అర్హత పరిశీలన సులభం కానుంది. రేషన్ కార్డులు, పెన్షన్ల సమాచారం, లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే నిధుల వివరాలు కూడా వాట్సాప్ ద్వారా అందించనున్నారు. ఒకే నంబర్‌తో అన్ని ప్రభుత్వ సేవలు అందించే వన్ స్టాప్ విధానం అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోం

# కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే వ్యతిరేకత

- **రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు**
- **మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**జగిత్యాల, , ఏప్రిల్ 3:**
కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన ప్రజలలో మార్పు రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలి అనే ఆలోచన వచ్చిందన్నారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జగిత్యాలలో తొలిసారిగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమంతోపాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి అయిన ప్రాణహిత నదీ జలాలను వినియోగించుకోకపోవడం, పునరుద్ధరించకపోవడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే మార్పు రావాలనే పరిస్థితి వచ్చిందన్నారు. భాజపా, బీఆర్ఎస్ నాయకులకు తనపై ఉన్న అభిమానానికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే కేటీఆర్ జీవన్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు, ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో గులాబీ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి గులాబీ పార్టీలో చేరితే స్థానికంగా బీఆర్ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## మంత్రి జూపల్లిని కలిసిన

# పర్యాటక శాఖ ఎండి గౌతమి

**హైదరాబాద్, , ఏప్రిల్ 3:**
పర్యాటక, సాంస్క తిక శాఖ స్పెషల్ సీఎస్ గా ఇటీవల నియమితులైన వాణి ప్రసాద్, అలాగే పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన పి.గౌతమిలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నూతన ప్రాజెక్టులపై దృష్టిసారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# ఆ పార్టీలకు కాలం చెల్లింది

**మొదటిపేజీ తరువాయి**
కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ లో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్ రోజురోజుకూ దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందనిధీమా వ్యక్తం చేశారు. 100 సీట్లు ఖాయం అని అన్నారు. రాముడేమైనా బీజేపీ జాగీరా.. వాళ్ల పార్టీల సభ్యత్వం ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్న బియ్యం పథకం దేశంలోనే చరిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్టాల్లో సన్న బియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో బీఆర్ఎస్ రోడ్డున పడిందని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ తో రూ.5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# మేడారంలో తీవ్ర విషాదం

- **రాతి కట్టడం కూలి బాలుడికి గాయాలు**
- **హాస్పిటల్ కు తీసుకెళ్లగా కాలు తీసేసిన వైద్యులు**

**ములుగు,, ఏప్రిల్ 3:**
ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారంలో తీవ్ర విషాదం నెలకొంది. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదం ఒక చిన్నారి జీవితంలో చీకటిని నింపింది. మేడారం పూజారి సిద్ధబోయిన రమేశ్ కుమార్ కొడుకు యువన్‌పై ఒక్కసారిగా రాతి కట్టడం కూలి పడటంతో ఈ దారుణం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని హాస్పిటల్‌కి తరలించారు. బాలుడు యువన్ ఆడుకుంటున్న సమయంలో సమీపంలోని ఒక రాతి కట్టడం ఒక్కసారిగా అతడిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని హాస్పిటల్‌కి తరలించగా వైద్యులు కాలు తొలగించారు. గాయం తీవ్రంగా ఉండటంతో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో కాలును తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తమ కళ్ల ముందు ఆడుకోవాల్సిన బిడ్డ ఇలా కాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో వారి ఆవేదన చూసి స్థానికులు సైతం చలించిపోయారు.





## ఇండియాకు అదనపు

# చమురు సరఫరా: రష్యా హామీ

**న్యూఢిల్లీ:**
పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇండియాకు చమురు సరఫరాను మరింత పెంచనున్నట్లు రష్యా ప్రకటించింది. ఆయిల్, లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (LNG) సరఫరాను పెంచబోతున్నట్లు రష్యా అధికారులు వెల్లడించారు. రష్యా మొదటి డిప్యూటీ ఛైర్మన్ డెనిస్ మాంటురోవ్ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ భేటీలో భారత అవసరాలకు అనుగుణంగా చమురు సరఫరా కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. భారత అవసరాలకు సరిపడా చమురును అందించే సామర్థ్యం రష్యన్ కంపెనీలకు ఉందని, అవసరమైతే ఉత్పత్తిని కూడా పెంచుతామని డెనిస్ మాంటురోవ్ తెలిపారు.
ఈ అంశంపై ఇండియాలోని రష్యన్ ఎంబసీ ప్రకటన విడుదల చేసింది. గత ఏడాది చివరినాటికి మినరల్ ఫెర్టిలైజర్స్ సరఫరాను 40 శాతం పెంచినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో భారత అవసరాలకు అనుగుణంగా మరింత పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది.
అణుశక్తి రంగంలో కూడా ఇండియా-రష్యా భాగస్వామ్యం మరింత బలపడుతోంది. ఇందులో భాగంగా కుడంకులామ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ కోసం పవర్ యూనిట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే ఇరు దేశాలు సంయుక్తంగా యూరియా ఉత్పత్తి ప్రాజెక్టును ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.
పరిశ్రమలు, అంతరిక్షం, విద్య, ఇన్నోవేషన్, వాణిజ్యం, టెక్నాలజీ, ఖనిజాలు వంటి రంగాల్లో కూడా రెండు దేశాలు కలిసి మరింతగా పని చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

# కార్బైడ్ మామిడి పండ్లను గుర్తించండి

- **పోలీస్ కమిషనర్ సజ్జానార్**



**హైదరాబాద్, ఏప్రిల్ 3:**
మామిడి పండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పండ్లు కనిపిస్తున్నాయి. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు మామిడిని అక్రమ పద్ధతుల్లో మాగబెట్టి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఇలాంటి పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జానార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రావడంతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని అన్నారు. అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ 'కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!' అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్‌ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

# భవన నిర్మాణానికి ముందస్తు పరీక్ష తప్పనిసరి

- **ఈ పరీక్షలు లేకపోతే భవనాలు కూలిపోతాయి**
- **జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ ప్రాముఖ్యతను మరచిపోకూడదు**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**



**హైదరాబాద్, ఏప్రిల్ 3:**
ఒకప్పుడు హైదరాబాద్‌లో ఒక ప్రముఖ భవనం పేకమేడలా కూలిపోయిన ఘటన మనందరికీ గుర్తుంది. ఆ సంఘటన తర్వాత ప్రతి నిర్మాణానికి ముందు సైట్ టెస్టింగ్‌ను తప్పనిసరి చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గుర్తు చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ ఖైరతాబాద్ లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్‌లో నిర్వహించిన "ఇంపార్టెన్స్ ఆఫ్ జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ & రికమెండేషన్స్" సాంకేతిక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ సంస్థలు కూడా దీనిని కఠినంగా అమలు చేయడం ప్రారంభించాయి. ఆ సమయంలో తన తండ్రి, అన్న, తమ కుటుంబానికి చెందిన డాక్టర్ బాబూరావులు ఈ సైట్ టెస్టింగ్ పనుల్లో పాల్గొన్నారు. అప్పుడే ఈ ప్రక్రియ ఎంత ముఖ్యమో నాకు స్పష్టంగా తెలిసిందన్నారు. ఒక భవనం నిర్మాణానికి ముందు నేల బలం ఎంత ఉంది? భూమి ఎంత బరువును తట్టుకోగలదు? నిర్మాణానికి అవసరమైన సామర్థ్యం ఎంత? అనే విషయాలు జియోటెక్నికల్ పరిశీలన ద్వారా తెలుసుకుంటారు. ఈ పరీక్షలు లేకపోతే భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సైన్స్, టెక్నాలజీ విపరీతంగా అభివృద్ధి చెందాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక డిజైన్లు, భారీ నిర్మాణాలు వేగంగా పెరుగుతున్నాయి. హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో మల్టీ స్టోరీ భవనాలు వేగంగా నిర్మించబడుతున్నాయి. నిర్మాణ ఖర్చు, సమయం రెండూ తగ్గాయి. గతంలో రెండేళ్లు పట్టిన పనులు ఇప్పుడు ఆరు నెలల్లో పూర్తవుతున్నాయి. అయితే ఈ వేగంలో ఒక ముఖ్యమైన జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ ప్రాముఖ్యత అంశాన్ని మనం మర్చిపోవద్దు. చిన్న నిర్మాణం అయినా, పెద్ద నిర్మాణం అయినా ప్రతి నిర్మాణానికి ముందు పూర్తి స్థాయి భూ సంబంధిత పరిశీలన తప్పనిసరిగా చేయాలి. ప్రభుత్వ విభాగాలు, ముఖ్యంగా నిర్మాణాలను నియంత్రించే మున్సిపల్ సంస్థలు జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌ను తప్పనిసరి చేసే విధంగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలి. అలా చేస్తే భవనాల భద్రత, ఆయుష్షు గణనీయంగా పెరుగుతాయి. ఇది ఈరోజు అత్యవసర అవసరం. ప్రతి సంక్షోభం కొత్త ఆలోచనలకు దారితీస్తుంది. కరోనా సమయంలో మనం డిజిటల్ ప్రపంచానికి అలవాటు పడ్డాం. ఈరోజు మన కార్యక్రమాన్ని వేలాదిమంది ఆన్లైన్ ద్వారా వీక్షిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటోంది. టెలివిజన్‌లలో మనం చూస్తున్న విధంగా క్షిపణులు భవనాలను ధ్వంసం చేస్తున్నాయి. ఇవి భవిష్యత్తులో నిర్మాణ రంగంలో పెద్ద మార్పులకు దారి తీస్తాయి. భవిష్యత్తులో రెండు ముఖ్యమైన మార్పులు కనిపిస్తాయి. ఇంధన రంగంలో పెట్రోల్, డీజిల్ స్థానంలో హైడ్రోజన్, ఎలక్ట్రిక్, సోలార్ వంటి ప్రత్యామ్నాయాలు విస్తరిస్తాయి. అలాగే నిర్మాణ రంగంలో భవనాలు మరింత బలంగా, ఏ విపత్తునైనా తట్టుకునేలా నిర్మాణమవుతాయి కాబట్టి నిర్మాణ రంగానికి చెందిన ప్రతి ఇంజినీర్, అధికారి, సంస్థ జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌ను అత్యంత ప్రాముఖ్యంగా తీసుకోవాలి. దీనిని తప్పనిసరి అంశంగా పరిగణించాలన్నారు.



సంపాదకీయం

# ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా?

పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷-ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధ్రాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా- ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా- ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా- ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

- అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం
- విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 3:** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా



పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శుత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

- డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్
- పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన



**కువైట్ సిటీ, ఏప్రిల్ 3:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్‌లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మీనా అల్-అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మీనా అల్-అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మీనా అల్-అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్-అహ్మదీ ర్గి÷నైరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పోరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

# రెండో ఎఫ్-35ను కూల్చేశాం: ఇరాన్

## అమెరికా ఆధునిక యుద్ధవిమానంపై సంచలన ప్రకటన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** అమెరికా వాయుసేనకు చెందిన అత్యాధునిక ఎఫ్-35 యుద్ధవిమానాన్ని తమ గగనతలంలో కూల్చేశామని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. తాజా ఘటనతో తమ చేతిలో కూలిన ఎఫ్-35ల సంఖ్య రెండుకు చేరిందని వెల్లడించింది. ఈ ఘటనలో విమానం పైలట్ తీవ్రంగా గాయపడినట్లు, అతడు ప్రాణాలతో బయటపడే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు ఇరాన్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ ప్రకటనపై యూఎస్‌సెంట్రల్ కమాండ్‌నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. ఇరాన్ చేసిన ఈ ప్రకటన నిజమైతే అమెరికాకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది. ప్రపంచంలో అత్యంత ఆధునిక యుద్ధవిమానాల్లో ఒకటైన ఎఫ్-35 లైటినింగ్2 తొలిసారి ప్రత్యక్ష యుద్ధంలో శత్రువుల దాడికి గురైనట్టు భావిస్తున్నారు. ఈ స్టెల్త్ యుద్ధవిమానం ఖరీదు 10 కోట్ల డాలర్లకు పైగా ఉంటుంది. స్టెల్త్ సాంకేతికత, అధునాతన సెన్సర్లు, నెట్‌వర్కింగ్ సామర్థ్యాలతో ఇది అమెరికా, దాని మిత్రదేశాల వాయుసేనకు కీలక భాగంగా నిలిచింది. ప్రస్తుతం 19 దేశాలు ఈ యుద్ధవిమానాన్ని వినియోగిస్తున్నాయి.

### జపాన్‌కు తోమహాక్ క్షిపణుల సరఫరా ఆలస్యం

ఇదే సమయంలో జపాన్‌కు అమెరికా సరఫరా చేయాల్సిన తోమహాక్ క్షిపణుల డెలివరీ ఆలస్యమవుతున్నట్లు సమాచారం. వందల సంఖ్యలో క్షిపణుల కొనుగోలుకు గతంలో ఒప్పందం కుదిరినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సరఫరా ప్రభావితమైందని తెలుస్తోంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరగడంతో అమెరికా తన సైనిక వనరులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నందున ఈ ఆలస్యం జరుగుతున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

# మరో 3 రోజులు పార్లమెంట్

## 16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం

## మహిళా రిజర్వేషన్, ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లులపై చర్చ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

# ఘనంగా పోచమ్మ బోనాలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో బీరప్ప కళ్యాణ మహోత్సవం పండుగ సందర్భంగా మొదటి రోజు శుక్రవారం నాడు పోచమ్మ బోనాలు ఘనంగా తీశారు, వివిధ గుడిల వద్దకు బోనాలు సమర్పించారు ఈ కార్యక్రమంలో కురుమ కుల సంఘ సభ్యులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

# తాళం వేసిన ఇంటిలో దొంగతనం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో ఓరుగంటి రాజు సన్నాఫ్ బాలయ్య వయసు 40 సంవత్సరాలు వృత్తి ఆర్టిజీఎన్ ఉదయం తన విధులకు వెళ్ళగా వారి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఉగ్ర మైసమ్మ గుడికి వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం లేదు, ఇంటి లోపలికి వెళ్లి చూడగా ఇంటి బీరువా లాకర్ పగలగొట్టి అందులో గల మూడున్నర తులాల బంగారం, వెండి 15 తులాల వెండి మరియు మరికొంత నగదు ఎవరో గుర్తుతెలియని దొంగలు దొంగలించకపోయినారు ఇట్టి విషయంపై ఫిర్యాదు రాగా ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కృష్ణవేణి హై స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే, స్పోర్ట్స్ & కల్చరల్ మీట్

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి నాంది..



**రాజముద్ర న్యూస్, మంథని, ఏప్రిల్ 03:** మంథని పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ అరిసె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఉన్నత విద్య దిశగా అడుగులు వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి పునాది అని, ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, లక్ష్యసాధన వంటి విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డే వంటి వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు భవిష్యత్ లక్ష్యాల వైపు దృష్టి సారించేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జాఫర్ హుస్సేన్, సుదర్శన్ రెడ్డి, నరేష్ లు , ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మంథని లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి



**రాజముద్ర న్యూస్,మంథని ఏప్రిల్ 03 :**మంథని లో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు, బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏగోళం శంకర్ గౌడ్ మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, పరాక్రమ వంతుడైన ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 3న జరుపుకుంటారనీ ఆయన 17వ శతాబ్దపు గొప్ప హిందూ యోధుడు, శివాజీ జయంతి (ఫిబ్రవరి 19) మరియు వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మహారాష్ట్రలో ఆయన వారసత్వాన్ని, ప్రజల పట్ల ఆయన నిబద్ధతను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారనీ హిందూ ధర్మ పరిరక్షణ, స్వరాజ్య స్థాపన, మరియు అద్భుతమైన పరిపాలనా దక్షతకు శివాజీ ప్రతీక.నివాళిఅని అన్నారు: ఈ రోజున ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు ప్రసంగాల ద్వారా ఆయన ధైర్యసాహసాలను, గెరిల్లా యుద్ధ తంత్రాలను (గనిమి కవా) ప్రజలు స్మరించుకుంటారనీ 17వ శతాబ్దంలో మొఘల్ రాజవంశాన్ని ఎదిరించి, మరాఠా రాజ్యాన్ని స్థాపించిన యోధుడు గా చరిత్రలో నిలిచిపోయారనీ శివాజీ మహారాజ్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన ధైర్య మార్గంలో నడవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ట్యాంక్ బండ్ పై దొడ్డి కొమురయ్య విగ్రహం పెట్టాలి

- దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది
- ప్రభుత్వ విప్,అలేర్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- రవీంద్రభారతిలో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలు



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర విప్, ఆలేర్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు.శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతిలో దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ చైర్మన్ జంగిటి కమలాకర్ కురుమ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, అలేర్ ఎమ్మెల్యే బీర అయిలయ్య కురుమ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కురుమ, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్,బిసి వెల్ఫేర్ కమిషనర్ బాల మాయాదేవి, క్యామ మల్లేష్ కురుమలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ నిజాం పాలనలో రైతులు అనుభవించిన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు.రైతాంగ హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు.1946 జూలై 4న కడవెండి గ్రామంలో జరిగిన రైతాంగ పోరాటంలో పాల్గొంటూ అమరుడైన దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందని తెలిపారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యువత దొడ్డి కొమురయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.జనగాం జిల్లా కు,వరంగల్ ఎయిర్పోర్ట్ కు దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై విగ్రహాన్ని ఎర్పాటు చేయాలని ముఖ్యమంత్రి తెలపగా సానుకూలంగా స్పందించారు. రాబోయే శతజయంతి ఉత్సవాలలో ఏర్పాటు చేసేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ కంకల ఏలేందర్ కురుమ, మాజీ కార్పోరేటర్ గొపు సదానంద్ కురుమ, సభ్యులు మంగ వెంకటేష్ కురుమ, మరాటి మల్లేష్ కురుమ, డాక్టర్ బర్ల మహేందర్ కురుమ, నారి మల్లేష్ కురుమ, గొరిగె నర్సింహ్మ కురుమ, వాసురి రాము కురుమ, సానికె శశి కుమార్ కురుమ,మరాటి మత్స్యగిరి కురుమ, దయ్యాల మహేష్ కురుమ, సోమరాజు కురుమ,భాస్కర్ కురుమ,స్వామి కురుమ, రాజు కురుమ తదితరులు పాల్గొన్నారు.

# సిలువపై యేసు త్యాగం మానవత్వాన్ని మేల్కొలిపిన మహా సందేశం

## భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా సాగిన గుడ్ ఫ్రైడే సిలువ యాత్ర





**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నేలకొండపల్లి పట్టణంలోని ప్రధాన పురవీధులు భక్తి పరవశంతో మార్మోగాయి. యేసుక్రీస్తు శిలువ వేయబడిన దుఃఖ ఘట్టాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ విశ్వాసులు ఉపవాసాన్ని ఆచరిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో సిలువ యాత్ర నిర్వహించారు. ఉదయం 9.30 నిమిషములకు పాత బస్ స్టాండ్ వద్ద గల రోమన్ క్యాతలిక్ చర్చి నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం, వీధి వీధి తిరుగుతూ సాగిన సిలువ యాత్రతో మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. యాత్రలో పాల్గొన్న క్రైస్తవుల చేతుల్లో సిలువలను మోసుకుంటూ, యేసుక్రీస్తు అనుభవించిన బాధలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. ప్రతి దశలో "ప్రభూ, మమ్ము క్షమించు" అంటూ వినిపించిన ప్రార్థనలతో వాతావరణం భావోద్వేగభరితంగా మారింది. ఈ సిలువ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తమ భక్తిని చాటుకున్నారు. సిలువ యాత్ర సాగిన మార్గమంతా స్థానికులు సిలువకు నీళ్లు ఆరబోస్తూ తమ భక్తి శ్రద్దలను చాటుకున్నారు.

**క్రీస్తు నేర్పిన ప్రేమ, క్షమ, సేవాభావం అందరు కలిగివుండాలి : ఫాదర్ స్మిలెన్ మారియో**

యేసు క్రీస్తు మానవాళి పాప విమోచన కోసం తన ప్రాణాలను సిలువపై అర్పించాడని ఫాదర్ స్మిలెన్ మారియో విశ్వాసులకు సందేశాన్ని అందించాడు. క్రీస్తు అనుభవించిన బాధలు, అవమానాలు అన్నీ ప్రేమతో సహించి చివరి శ్వాసవరకు క్షమాభావాన్ని చూపించాడని అలాంటి క్షమాబావాన్ని ప్రతి ఒక్కరు కలిగి జీవించాలని బోధించారు. ఒక పక్క తనను చంపివేస్తున్నారని తెలిసి కూడా వారిని క్షమించుము తండ్రి అనే ఆయన సిలువపై పలికిన మాటలు అపారమైన దయకు నిదర్శనమని బావోద్వేగబరిత ప్రసంగం చేశారు. సిలువపై చేసిన ఈ త్యాగం మానవత్వానికి ప్రేమ, క్షమ, సేవ అనే మహత్తర విలువలను నేర్పించిందని వెల్లడించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జోసెఫ్, బ్రదర్ మరియకుమార్, ఉపదేశకులు సూరేపల్లి జ్ఞానరత్నం, పుష్ప, థామస్, ప్రసాద్, పుల్లారావు, నాగేశ్వరావు, బాలరాజు, మాజీ వార్డు సభ్యులు పగిడికత్తుల రాంబాబు, ఎస్సి సెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీ నారాయణ, మాల మహానాడు నాయకులు జంగం ప్రసాద్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా కార్యదర్శి అవుట మధు, విచారణ సంఘ పెద్ద సిద్దెల వెంకట రత్నం, లక్ష్మి, ప్రసాద్, యువతి యువకులు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# తెలంగాణ ఉద్యమ జ్వాల దొడ్డి కొమరయ్య: పాగర్తి సుధాకర్


**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ఉద్యమకారుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ ఆధిపత్యానికి, అహంకారానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన 'తెలంగాణ సాయుధ పోరాటం' మిగతా ప్రపంచ పోరాటాల కంటే భిన్నమైనది. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఈ స్ఫూర్తే నియంత పోకడలను నిలువరించడానికి అవసరమైన భావజాలాన్ని అందించింది. అన్యాయం శృతి మించితే ఆయుధాలను ఎత్తించి, ధిక్కార స్వరాలై నిలదీసేలా చేసింది. నిజాం నిరంకుశ పాలనకు, దొరల పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలనుకున్న మిలిటరీ పాలనకు ఎదురొడ్డి 4000 మంది కార్యకర్తలు అమరులైనారని అన్నారు,ఆ కోవలో అమరుడై, తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చినవారే దొడ్డి కొమురయ్య అని అన్నారు, ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు మండల నాయకులు పుట్టా సత్యనారాయణ,సయ్యద్ మోహినుద్దీన్, కళ్యాణం నాగేశ్వరరావు, బానోతు శ్రీనివాసరావు, మూడు రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది

# నూతనంగా ఎన్నికైన అడ్వకేట్ బార్ అసోసియేషన్ సభ్యులని సన్మానించిన టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్



**రాజముద్ర న్యూస్, పెద్దపల్లి, ఏప్రిల్ 03:**పెద్దపల్లి అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులుగా పెద్దలు సీనియర్ న్యాయవాది మేకల మల్లేశంని, ప్రధాన కార్యదర్శి రచూరి శ్రీకాంత్ ని, ఉపాధ్యక్షులుగా లకిడి శ్రావణ్ ని ,కోశాధికారిగా బొంకూరి సంతోష్( బాబ్జి)ని,లైబ్రరీ సెక్రెటరీగా పుట్ట రవిని ,స్పోర్ట్స్ మరియు కల్చరల్ సెక్రటరీగా తాని నరేష్ లని శాలువా కప్పి సన్మానించి స్వీట్ తినిపించిన టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్ కుమార్. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది AGP ఉప్పు రాజన్న, అడ్వకేట్ రమేష్, హనుమంతుని పేట్ సర్పంచ్ మాడగొని శ్రీనివాస్ మరియు ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్, ఉప్పు శివ కుమార్ తదితరులు ఉన్నారు.

# వడ్డీ వలయం.!



- ఏజెన్సీలో అడ్డుకట్టలేని దోపిడి
- భయంతో మూగబోయిన ప్రజలు
- చర్యల కోసం ప్రభుత్వాన్ని వేడింపు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

ఏజెన్సీ ప్రాంతంలో వడ్డీ మాఫియా పెచ్చరిల్లి రైతులు, సామాన్య ప్రజలపై భారీగా ఆర్థిక దోపిడికి పాల్పడుతున్న పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న అవసరాల కోసం అప్పు తీసుకున్న వారిని అధిక వడ్డీ భారంతో కుంగదీస్తూ, జీవితాలను నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తున్న ఈ దందా నియంత్రణ లేకుండా కొనసాగుతోంది. అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా పట్టణం నుంచి పల్లె దాకా వడ్డీ వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా విస్తరిస్తోంది. తినడానికి తిండి లేని స్థితి నుంచి మొదలైన కొందరు, అధిక వడ్డీ వసూలు చేస్తూ కోట్లలో ఆస్తులు కూడబెట్టుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా ప్రభుత్వ ఖజానాకు కూడా గండి కొడుతోందని స్థానికులు చెబుతున్నారు.వడ్డీ పేరుతో జరుగుతున్న ఈ దోపిడిలో బలహీన వర్గాలే ఎక్కువగా బలవుతున్నారు. అప్పు తీర్చలేక ఇళ్లు, భూములు కోల్పోయిన ఘటనలు కూడా బయటకు రావడం లేదు. భయాందోళనలతో బాధితులు ముందుకు రావడంలేదు. ప్రశ్నించే ప్రయత్నం చేసిన వారిపై బెదిరింపులు, దాడులు, సామాజికంగా అవమానించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.దొడ్డిదారిలో సాగుతున్న ఈ అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవడంలో సంబంధిత శాఖలు విఫలమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార యంత్రాంగం నిశితంగా పరిశీలించి, వడ్డీ మాఫియాను అణచివేయాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా సంపాదించిన ఆస్తులపై దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పెరుగుతున్న ఈ వడ్డీ దందా సామాజిక అసమానతలను మరింత పెంచుతూ, పేదల జీవితాలను చీకటిలోకి నెట్టేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, ప్రజలను ఈ దోపిడిదారుల నుంచి కాపాడాలని స్థానికులు వేడుకుంటున్నారు.



# అభివృద్ధి చూపే కొత్త ప్రయత్నం

- ఫోటో ఫ్లెక్సీలు ద్వారా పారదర్శకత
- ప్రజలతో కలసి గ్రామాభివృద్ధి
- ఇతర గ్రామాలకు ఆదర్శం

**బోనకల్, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

బోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలిసేలా చేయడానికి గ్రామ ఆవరణలో ఫోటో చిత్రీకరణ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ముందుండి నిర్వహించటం విశేషం. ఫ్లెక్సీల ద్వారా గ్రామంలో జరిగిన రహదారి నిర్మాణాలు, డ్రైనేజీ వ్యవస్థలు, పరిశుభ్రత చర్యలు, పచ్చదనం కార్యక్రమాలు తదితర అభివృద్ధి పనులను ప్రజలకు ప్రత్యక్షంగా చూపించారు. దాంతో గ్రామవాసులు తమ గ్రామంలో జరిగే మార్పులను చూసి సంతోషం వ్యక్తం చేశారు.స్థానికులు సర్పంచ్ జ్యోతి కొండ కృషి, పంచాయతీ పాలకవర్గం, మల్టీపర్పస్ వర్కర్ల పనితీరును ప్రశంసిస్తూ, ఇలాంటి పారదర్శక కార్యక్రమాలు మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధి కోసం తీసుకున్న ఈ చర్య ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి మండల అధికారులు మరియు స్థానిక ప్రజల సహకారం అవసరమని సర్పంచ్ జ్యోతి కొండ తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి అంశాల్లో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు వచ్చి గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్ బానోతు కొండ, కార్యదర్శి కోలా రాజేశ్వరి, పంచాయతీ పాలకవర్గం ఆశాభావం వ్యక్తం చేస్తూ, బోనకల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో సహకారం కావాలని పేర్కొన్నారు.

# నీళ్లు నిలవాలి.!



- పూడికతో సామర్థ్యం క్షీణం
- వృథాగా పోతున్న ప్రాజెక్టు నీళ్లు
- చెరువు పునరుద్ధరణకు రైతుల డిమాండ్

**అశ్వారావుపేట, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

మండలంలోని అనంతారం చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులో పూడిక పేరుకుపోవడం, వండ్రు మట్టి అధికంగా చేరడం వల్ల నీరు నిల్వ ఉండక ముందే బయటకు వెళ్లిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సాగునీటి కొరత తీవ్రంగా పెరిగి, రైతుల పంటలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. పెదవాగు ప్రాజెక్టు ద్వారా వచ్చే నీరు సక్రమంగా వినియోగం కాకుండా వృథాగా పోతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతారం చెరువు నీటి సామర్థ్యాన్ని పెంచితే ఈ నీటిని నిల్వ ఉంచి, సాగుకు ఉపయోగించుకోవచ్చని వారు చెబుతున్నారు. ప్రస్తుతం చెరువు ఐకట్టు ఎక్కువగా ఉన్నప్పటికీ, నిల్వ నీటి పరిమాణం తక్కువగా ఉండడం సమస్యగా మారింది. అశ్వారావుపేట మండలంలోని అనంతారం–గాండ్లగూడెం రహదారి మధ్యలో ఉన్న ఈ చెరువు పరిసర ప్రాంతాల రైతులకు ప్రధాన ఆధారంగా ఉంది. కానీ పూడిక కారణంగా నీటి నిల్వ తగ్గిపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. చెరువును పునరుద్ధరించి, పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచితే రైతులకు గణనీయమైన లాభం చేకూరుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించి పూడిక తొలగింపు పనులు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువు పునరుద్ధరణ జరిగితే నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభించడంతో పాటు, వ్యవసాయం బలోపేతం అవుతుందని ఆశిస్తున్నారు. రైతుల ఆశలను నెరవేర్చే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# పాలు పోసిన ఆనందం

- పామాయిల్ ధర పెరుగుదలపై రైతుల సంబరం
- చిత్రపటానికి అభిషేకంతో కృతజ్ఞతలు
- మంత్రి చర్యలపై ప్రశంసలు

**అశ్వారావుపేట ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

పామాయిల్ పంట ధర గణనీయంగా పెరగడంతో వినాయకపురం ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ధర 21,546 రూపాయల నుంచి 1,459 రూపాయలు పెరిగి 23,005 రూపాయలకు చేరుకోవడం రైతులకు ఊరట కలిగించింది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పామాయిల్ పంటకు మెరుగైన ధర లభించేందుకు తీసుకున్న చర్యలు ఎంతో ఉపశమనం కలిగించాయని పేర్కొన్నారు.పామాయిల్ సాగు రైతులకు ఇది పెద్ద ఊరటగా మారిందని, భవిష్యత్తులో మరింత ప్రోత్సాహక చర్యలు తీసుకుంటే రైతాంగానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టి రైతులకు మద్దతుగా నిలవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల మురళి, మరుతి వసంతరావు, నల్లపు రామారావు, ఉప్పల ప్రసాద్, పొట్టా రాజులు, బిర్రం ఉదయ్ కుమార్, రొయ్యల సత్యనారాయణ, ఉప్పల నాగు, సింగల్ దేవి దుర్గారావు, కక్కిరాల నాగరాజు, గాలి రాంబాబు, ఉప్పల దుర్గాప్రసాద్, ఉప్పల తాతారావు, ఆది ప్రశాంత్, ఇళ్ల సురేష్, లోకం అశ్విని, ఉప్పల వెంకటరమణ, కక్కిరాల హరీష్, పోకల సాయి సుబ్రహ్మణ్యం, విర్నాల నరేష్, బేతం రాము, రెడ్డి సీతయ్య, నారం శివ, బత్తుల తిరుమలేష్, ఉప్పల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# మానవతా స్ఫూర్తి

- భర్త మరణంలో అవయవ దానం
- డిజిటల్ మీడియా మహిళా జర్నలిస్టు సాహసం
- కొత్త జీవితం లభించేలా సహకారం

**సత్తుపల్లి, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**



ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన డిజిటల్ మీడియా జర్నలిస్టు పాపినేని అనంత లక్ష్మి, భర్త మరణ సమయంలో కూడా మానవతా విలువలను నిలబెట్టారు. భర్త నాగేశ్వర రావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ కామినేని ఆసుపత్రిలో ఐదు రోజుల చికిత్స తరువాత ప్రాణాలు కోల్పోయారు. తన భర్త అవయవాలను దానం చేసి, పలువురికి కొత్త జీవితం లభించేలా సాయం చేసిన అనంత లక్ష్మి సాహసం ప్రదర్శించారు. నాగేశ్వరరావు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

# ఆప్యాయ పరామర్శ



- దమ్మపేటలో సంతాప వాతావరణం
- కుటుంబానికి ధైర్యం చెప్పిన నేతలు
- పెద్ద ఎత్తున నాయకుల హాజరు

**దమ్మపేట, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

దమ్మపేట మండలంలో సంతాప వాతావరణం నెలకొంది. మండలానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకుడు అబ్దుల్ జిన్నా తల్లి జానీబీ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించారు.అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ పార్టీ బాధ్యుడు మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి రాష్ట్ర స్థాయి నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి కుటుంబాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో తమ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్, వార్డ్ సభ్యులు దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, రూపా రాంబాబు, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, కాసిని శ్రీను, బుడే, మద్దెల పుల్లారావు, కౌలురి నాగయ్య, సున్నం శ్రీను, వెలుగోటి మహేష్, సాయి, దండాబత్తుల కాంతారావు, పోలయ్య, కోళ్ళు శేఖర్, బెక్కం వెంకటేశ్వరరావు, చిన్నంశెట్టి మధు, మాలపల్లి సుబ్బారావు, వెంకన్న, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# సభలే సర్దుబాటు?

- ప్రణాళికపై బిజెపి విమర్శలు
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- బడ్జెట్ విడుదలకు డిమాండ్

**సుజాతనగర్, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**



ప్రజా పాలన పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభలపై బిజెపి జిల్లా నాయకుడు భూక్య రాజేష్ నాయక్ తీవ్ర విమర్శలు గుప్పించారు. స్పష్టమైన కార్యాచరణ లేకుండా కేవలం రాజకీయ ప్రచారం కోసమే ఈ సభలు నిర్వహిస్తున్నట్లు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. 99 రోజుల ప్రణాళిక పేరుతో గ్రామసభలు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు కనిపించడం లేదని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, లబ్ధిదారులకు చేరాల్సిన ప్రయోజనాలు అనేక అడ్డంకులతో నిలిచిపోయాయని విమర్శించారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతుల అభివృద్ధిపైనా నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు.రెండున్నర సంవత్సరాల పాలనలో అనేక హామీలు ఇచ్చినా, ముఖ్యంగా ప్రకటించిన ఆరు హామీలను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారని ఆరోపించారు. ఇళ్ల పథకాల్లో స్థాయిలు పెట్టి బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నారని, కొత్త పెన్షన్లు అమలు కాలేదని, మహిళలకు ఆర్థిక సాయం అందడం లేదని, రైతు కూలీలకు భరోసా లేకపోయిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి అమలు విషయంలో కూడా స్పష్టత లేదని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జాబితాలను విభజిస్తూ నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని, పేదల ఇళ్ల కల నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమవుతోందని మండిపడ్డారు. ఐదు లక్షల రూపాయలతో పేదలకు ఇళ్లు నిర్మించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఖమ్మం జిల్లాలో మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే హామీల అమలు దిశగా చర్యలు చేపట్టి, ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరే విధంగా పాలన సాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# అశ్వారావుపేటలో గుర్రాల చెరువు గుడి శంకుస్థాపన

- శంకుస్థాపన అంగరంగ వైభవంగా ముగిసింది
- యువకులు, వ్యాపారస్తులు, భక్తుల కృషితో గుడి నిర్మాణం

**అశ్వారావుపేట, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**



అశ్వారావుపేట మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో త్రిపురాంబ సమేత కుండలేశ్వర స్వామి వారి ఆలయ శంకుస్థాపన అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ స్థల దాత సంకురాత్రి సతీష్ చేతులతో శంకుస్థాపన కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ ఆలయం నిర్మాణంలో గ్రామ యువకులు, భక్తులు, వ్యాపారస్తులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు. ప్రత్యేకంగా, గుడిలోని ప్రధాన శివలింగానికి పురుషులు, మహిళలు, పిల్లలు కూడా అభిషేకం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. నిర్మాణం వాస్తు పండిట్ మేడూరి సాంబ శివ ప్రసాద్ శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో జరుగుతోంది. భవిష్యత్తులో ఈ ఆలయం స్థానిక భక్తులకు ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుంది.

# సిలువే రక్షణ మార్గం

- గుడ్ ఫ్రైడే సందేశంలో ఆత్మీయ పాఠాలు
- ప్రేమ, క్షమ, త్యాగం గుణాలపై పిలుపు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఆరాధనలు

**బోనకల్, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

గుడ్ ఫ్రైడే సందర్భంగా బోనకల్ మండలంలోని కలకోట తెలుగు బాప్టిస్ట్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి సదానంద్ పాల్ మాట్లాడుతూ యేసు క్రీస్తు సిలువ త్యాగం వలన, ఆయన పవిత్ర రక్తం చిందించుట వలననే మానవాళికి రక్షణ లభించిందని తెలిపారు.మనుషులు అహంకారం, గర్వాన్ని విడిచిపెట్టి ప్రేమ, త్యాగం, సహనం గుణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సిలువపై యేసు ఎదుర్కొన్న శ్రమలను గుర్తు చేసుకుంటూ, ఇతరుల చేత బాధలు ఎదురైనా క్షమించే గుణం కలిగి ఉండాలని సూచించారు. పరస్పర సహకారంతో జీవించడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని వివరించారు.దైవ సేవలో పాల్గొన్న కత్తి జయపాల్ మాట్లాడుతూ ప్రతి మనిషి క్షమాగుణాన్ని పెంపొందించుకొని నిత్యజీవాన్ని పొందాలని అన్నారు. యేసు సిలువపై కూడా తన తల్లిని జ్ఞాపకం చేసుకుంటూ తల్లిదండ్రుల పట్ల బాధ్యతలను గుర్తు చేసినట్లు తెలిపారు.అనూష పాల్ మాట్లాడుతూ ప్రతి విశ్వాసి చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆత్మీయ దాహాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం యేసు సిలువపై పలికిన ఏడు మాటలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్ద యంగల జీవరత్నం, తోటపల్లి సాల్మన్, యంగల అమరయ్య, గద్దల ముత్తయ్య, మాతంగి శ్రీను, బరుగుల ఎంకయ్య, యంగల ఏసేపు, కొమ్ముగిరి నరేష్, యంగల ప్రదీప్, మాతంగి అశోక్ తదితరులు, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



# ఇసుక స్మగ్లింగ్ బట్టబయలు



- మూడు టిప్పర్లు స్వాధీనం
- 100 టన్నుల ఇసుక పట్టివేత

**సత్తుపల్లి, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామ పరిసర ప్రాంతంలో అంతర్రాష్ట్ర ఇసుక స్మగ్లింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ నిర్వహించిన ఆకస్మిక దాడిలో సుమారు 100 మెట్రిక్ టన్నుల ఇసుకతో మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఈ ఇసుకను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఈస్ట్ గోదావరి జిల్లా కోవ్వూరు ర్యాంప్ నుంచి సత్తుపల్లి వరకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారానికి దొడ్డా శ్రీనివాసరావు, దొడ్డా ప్రవీణ్ ప్రధాన సూత్రదారులుగా బయటపడ్డారు. చట్టబద్ధ అనుమతులు లేకుండా యంత్రాలతో ఇసుకను లోడ్ చేసి రవాణా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నం.150/2026 నమోదు చేసి, మొత్తం 8 మందిపై కేసు నమోదు చేశారు.అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా కనిపించిన వెంటనే సమాచారం అందించాలని విజిలెన్స్ అధికారులు ప్రజలను కోరారు.

# అనారోగ్య బాధితులను పరామర్శ



- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

**అశ్వారావుపేట, ఏప్రిల్ 03 రాజముద్ర న్యూస్:**

అశ్వారావుపేట మండల కేంద్రంలో బండారు మహేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటిలో విశ్రాంతి తీసుకుంటుండగా, ఎమ్మెల్యే జారె వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.తదుపరి కార్యక్రమంలో దమ్మపేట మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న దమ్మపేట ఆర్ఎంపీ డాక్టర్ల యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ వహాబ్‌ను కూడా పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్, చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# నేను క్రికెట్ ఆడటం వారికి నచ్చడం లేదు

## రహానే సంచలన వ్యాఖ్యలు!

**ఢిల్లీ:** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మరో ఓటమి ఎదురైంది. టోర్నీ మొదటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడిన కేకేఆర్.. రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) చేతిలో ఓటమిని చవిచూసింది. ఎస్ఆర్‌హెచ్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్యంను ఛేదించే క్రమంలో కేకేఆర్ తడబడింది. నిర్ణీత ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయి వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది. ఈ ఓటమితో కేకేఆర్ అభిమానులు నిరాశకు గురయ్యారు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ అజింక్య రహానే.. 10 బంతుల్లో 8 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. కీలకమైన సమయంలో నెమ్మదిగా ఆడి తక్కువ పరుగులకే అవుట్ కావడంతో.. రహానే స్ట్రైక్‌రేట్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఆధునిక టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లుగా రహానే ఆడలేకపోతున్నారనే వాదనలు వినిపించాయి. వాటిపై రహానే ఘాటుగా స్పందించాడు. తన సక్సెస్ చూడలేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డాడు. తాను క్రికెట్ ఆడటం కొందరికి నచ్చడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో జింక్స్ స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'నా స్ట్రైక్‌రేట్‌పై విమర్శలు చేసేవారికి అసలు క్రికెట్ గురించి తెలుసో లేదో అర్థం కావడం లేదు. బహుశా వారు సరిగ్గా మ్యాచ్‌లు చూడటం లేదేమో. లేదా నాపై ఏదైనా ప్రత్యేక అజెండాతో ఉన్నారేమో అనిపిస్తోంది. నా సక్సెస్ చూసి కొందరు అసూయ పడుతున్నారు. అందుకే నా ఆటను తక్కువ చేసి మాట్లాడుతున్నారు. కేవలం ఒక్క ఇన్నింగ్స్ ఫెయిల్యూర్‌ను బట్టి నా ఉద్దేశాలను తప్పుబట్టడం సరికాదు. నేను క్రికెట్ ఆడటం, విజయం సాధించడం వారికి నచ్చడం లేదు. బయట నా గురించి నెగెటివ్‌గా మాట్లాడుతున్నా సరే.. నాపై చర్చ జరుగుతున్నందుకు నేను సంతోషంగానే ఉన్నాను. వారిని ఏదైనా మాట్లాడుకోనివ్వండి' అని రహానే ఆవేదన వ్యక్తం చేశాడు.

# వైభవ్ సూర్యవంశీని చూసి నేర్చుకో పంత్..

## మైఖేల్ వాన్ సంచలన వ్యాఖ్యలు!

### రూ. 27 కోట్ల ఆటగాడిపై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ విమర్శలు..

### టీమ్ ఇండియాలో చోటు దక్కాలంటే ఐపీఎల్‌లో చెలరేగాల్సిందే

**ఢిల్లీ:** ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ప్రదర్శనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటు బ్యాటర్‌గా, ఇటు కెప్టెన్‌గా పంత్ తీవ్రంగా నిరాశపరుస్తున్న తరుణంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పంత్ తన ఆటతీరును మార్చుకోవాలని, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తరహాలో దూకుడు ప్రదర్శించాలని సూచించారు. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన పంత్, 9 బంతుల్లో కేవలం 7 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మెగా వేలంలో రూ. 27 కోట్లు పెట్టి కొనుగోలు చేసినప్పటికీ, పంత్ లక్నో జట్టును కనీసం ప్లే ఆఫ్స్‌కు కూడా చేర్చలేకపోయారని విమర్శలు వస్తున్నాయి. పంత్ నైపుణ్యంపై తనకు ఎటువంటి సందేహం లేదని, అతను ప్రపంచంలోని ఏ దేశానికైనా సులభంగా ప్రాతినిధ్యం వహించగల సామర్థ్యం ఉన్న ఆటగాడని వాన్ పేర్కొన్నారు. అయితే, టీమ్ ఇండియాలో చోటు దక్కించుకోవాలంటే మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుతం భారత జట్టులో ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, జితేష్ శర్మ వంటి వికెట్ కీపర్ల నుంచి పంత్‌కు తీవ్రమైన పోటీ ఎదురవుతోందని గుర్తు చేశారు. జాతీయ జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే పంత్ ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇవ్వాలని వాన్ అభిప్రాయపడ్డారు. "పంత్ తన బ్యాటింగ్ స్థానాన్ని మార్చుకోవాలి. ఓపెనర్‌గా కాకుండా మూడో స్థానంలో వచ్చి, వైభవ్ సూర్యవంశీలా బంతిని మైదానం బయటకు పంపే ప్రయత్నం చేయాలి. తాను 48 బంతుల్లోనే సెంచరీ చేయగలననే ఆత్మవిశ్వాసంతో ఆడాలి" అని సూచించారు. ఐపీఎల్ ముగిసేలోపు పంత్ తన ఫామ్ పుంజుకోకపోతే టీమ్ ఇండియా భవిష్యత్తు ప్రణాళికల్లో అతని స్థానం ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.





# చెపాక్ కోటలో పంజాబ్ 'పంజా'

## చెన్నైకి సొంత గడ్డపై షాక్!

- ఐపీఎల్ ఏడో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ ఘన విజయం
- భారీ స్కోరును ఆవలీలగా ఛేదించిన పంజాబ్ బ్యాటర్లు
- మెరిసిన శ్రేయాస్ అయ్యర్, ప్రియాంశ్ ఆర్య
- వృథా అయిన ఆయుష్ మ్హాత్రే, శివమ్ దూబే శ్రమ



**చెన్నై:** ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠభరిత పోరులో చెన్నై సూపర్ కింగ్స్ కు చేదు అనుభవం ఎదురైంది. భారీ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ జట్టు ఐదు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై 209 పరుగుల భారీ స్కోరు సాధించినా.. పంజాబ్ బ్యాటర్ల సమష్టి కృషితో ఆ లక్ష్యం చిన్నబోయింది. ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ జట్టు విజయాన్ని ముద్దాడింది.

### చెన్నై ఇన్నింగ్స్ సాగిందిలా..

టాస్ గెలిచిన పంజాబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ కు దిగిన చెన్నై జట్టుకు ఆయుష్ మ్హాత్రే అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 43 బంతుల్లోనే 73 పరుగులు సాధించి పంజాబ్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే తనదైన శైలిలో సిక్సర్లతో చెలరేగాడు. 27 బంతుల్లో 45 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్ చివర్లో సర్ఫరాజ్ ఖాన్ పూనకం వచ్చినట్లు ఆడాడు. కేవలం 12 బంతుల్లోనే 32 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో చెన్నై నిర్ణీత ఇరవై ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ వైశాక్ నాలుగు ఓవర్లలో 38 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. యుజ్వేంద్ర చాహల్ మూడు ఓవర్లలో 21 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా, మార్కో జాన్సెన్ భారీగా పరుగులు (4 ఓవర్లలో 43) సమర్పించుకుని ఒక వికెట్ తో సరిపెట్టుకున్నాడు.



### లక్ష్య ఛేదనలో పంజాబ్ పంజా..

210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్ 34 బంతుల్లో 43 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 29 బంతుల్లోనే 50 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే మ్యాచ్ ను పూర్తిగా పంజాబ్ వైపు తిప్పింది మాత్రం ప్రియాంశ్ ఆర్య. క్రీజులోకి రాగానే బౌండరీల వర్షం కురిపించిన ప్రియాంశ్.. కేవలం 11 బంతుల్లోనే 39 పరుగులు సాధించి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ సుడిగాలి ఇన్నింగ్స్ తో పంజాబ్ పని మరింత సులువైంది. 18.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి 210 పరుగులు సాధించి ఘన విజయం సొంతం చేసుకుంది.

### తేలిపోయిన చెన్నై బౌలర్లు..

సొంత మైదానంలో భారీ స్కోరును కాపాడుకోవడంలో చెన్నై బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. పంజాబ్ బ్యాటర్లను కట్టడి చేయలేక చేతులెత్తేశారు. అన్షుల్ కాంబోజ్ 3.4 ఓవర్లలో 43 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. మ్యాట్ హెన్రీ ఏకంగా 54 పరుగులు సమర్పించుకుని రెండు వికెట్లు తీసుకున్నాడు. ఖలీల్ అహ్మద్ మూడు ఓవర్లలో 28 పరుగులిచ్చినా వికెట్ దక్కించుకోలేకపోయాడు. కచ్చితమైన లైన్ లెంగ్త్ తో బంతులు వేయకపోవడంతో పంజాబ్ సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకుంది. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ టోర్నీలో తమ ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుకోగా, సొంత గడ్డపై అభిమానుల మధ్య ఓడిపోవడం చెన్నైకి తీవ్ర నిరాశను మిగిల్చింది. తదుపరి మ్యాచ్ లలో బౌలింగ్ విభాగంపై చెన్నై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఆ ఒక్క కారణంతోనే ముంబైని వదిలేశా..

### ఇంటర్వ్యూలో టెండూల్కర్ షాకింగ్ కామెంట్..!

**ముంబై :** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జట్టుకు ఆడుతున్న ఆటగాళ్లలో అర్జున్ టెండూల్కర్ ఒకడు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తనయుడిగా మనందరికీ సుపరిచితుడైన అర్జున్ ఈసారి తనకు మరిన్ని అవకాశాలు వస్తాయనే ఆశాభావంతో ఉన్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతున్న ఈ పొడగరి ఆల్‌రౌండర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని ఎందుకు వీడాల్సి వచ్చిందో చెప్పేశాడు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్ షోలో మాట్లాడిన అర్జున్ బెంచ్ మీద ఉండడం ఇష్టం లేకనే ముంబైని వదిలేశానని చెప్పాడు. పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కు ఆడుతున్న అర్జున్ టెండూల్కర్ ఈసారి తన ముద్ర వేయాలనుకుంటున్నాడు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఈ పొడగరి ఆల్‌రౌండర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని వీడడానికి దారి తీసిన కారణాలను వెల్లడించాడు. శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్‌లో తన మనసులోని మాటల్ని, బాధను వెళ్లగక్కాడీ యంగ్‌స్టర్. 'ముంబై ఇండియన్స్ తరఫున మీరు కొన్ని మ్యాచ్‌లు ఆడారు. మీ స్వింగ్ కూడా బాగుంది. మీకు మరిన్ని అవకాశాలు వస్తాయని ఊహించి ఉంటారు కదా? అని అడిగిన ప్రశ్నకు అర్జున్ ఏ ఆటగాడైనా సరే అలాగే అనుకుంటారు. ఎవరూ కూడా బెంచ్ మీద కూర్చోవాలని కోరుకోరు. అయితే.. అవకాశం వచ్చినప్పుడు బాగా కష్టపడి అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది' అని అర్జున్ తెలిపాడు. ఆది నుంచి వివాదాస్పదమవుతున్న ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధనపై కూడా అర్జున్ తన అభిప్రాయం పంచుకున్నాడు. ఆల్‌రౌండర్ అయినందున ఈ నియమాన్ని వ్యక్తిగతంగా తాను వ్యతిరేకిస్తానని అతడు అన్నాడు. 'ఏ ఫార్మాట్‌లోనైనా పదకొండు మందిని ఎంచుకొని ఆడాల్సి ఉంటుంది. కానీ, ఐపీఎల్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నియమం ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో, ఇతర దేశాల లీగ్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన లేదు. ఈ నియమంతో ఆల్‌రౌండర్లకు అవకాశాలు రావడం లేదు. కాబట్టి.. వ్యక్తిగతంగా నేను ఈ నియమాన్ని వ్యతిరేకిస్తాను' అని అర్జున్ వెల్లడించాడు.



### 5 మ్యాచుల్లో 3 వికెట్లు

తొలి మ్యాచ్‌లో తమ జట్టు ఓటమిపై స్పందించిన అతడు .. లక్నో మిడిలార్డర్ పటిష్టంగా ఉందని, టీర్నోలో తాము పుంజుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇప్పటివరకూ 5 ఐపీఎల్ మ్యాచుల్లో అర్జున్ 3 వికెట్లు తీశాడంతే. అతడి అత్యుత్తమ ప్రదర్శన.. 1/9.




# ఆది కొత్త సినిమా సైరాబాను

## క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం


టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంఇతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.



## ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో..

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సం' తం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.

## పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా




### నటి మాళవికా మోహనన్

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.




## ఓటీటీలోకి ఎస్ సరస్వతి మూవీ

ఓటీటీలోకి ఎస్ సరస్వతి మూవీ

వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. గత నెల మార్చి 6న థియేటర్లలో విడుదలై ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, జీవా, మురళీ శర్మ, రావు రమేశ్, రాధికా శరత్‌కుమార్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. కథ విషయానికి వస్తే, లక్ష్మి అనే ఓ అనాథ మహిళ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ తన కూతురు 'ఎస్. సరస్వతి'ని ఎంతో ప్రేమగా పెంచుకుంటుంది. అయితే ఆగస్టు 15న తన కూతురిని స్కూల్లో దించి ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మి.. ఆ తర్వాత తన కూతురు కనిపించడం లేదని, స్కూల్లోనే ఆమెపై అఘాయిత్యం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తుంది. పోలీసులు విచారించగా అసలు అలాంటి పాపే ఆ స్కూల్లో లేదని తేలడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఇంతకీ ఆ పాప ఏమైంది, లక్ష్మి చెబుతున్నది నిజమా లేక ఇదంతా ఆమె భ్రమా అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సాగుతుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు నేరుగా ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com